

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటి మట్టం మంగళవారం 519.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,000, గరిష్ట ధర రూ.1,800, మోడల్ ధర రూ.1,400 వరకు పలికింది.

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో రష్మీకి కాంస్యం



విజయవాడ స్పోర్ట్స్: ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఇటీవల జరిగిన 62వ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో విజయవాడకు చెందిన కె.రష్మీ జావెలిన్‌త్రో విభాగంలో కాంస్య పతకం సాధించింది.

న్యూస్‌రీల్

బాలవాటిక-3లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: కేంద్ర నూతన విద్యావిధానంలో భాగంగా తెనాలి కేంద్రీయ విద్యాలయంలో కొత్తగా ప్రారంభించనున్న బాలవాటిక-3లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలవాటికలో ప్రవేశానికి ఐదేళ్లు నిండి ఆరేళ్లలోపు చిన్నారులు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉంటుందని, జూలై 6, 2023 నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. దరఖాస్తుకు ఆఖరు తేదీ జూలై 18, 2023 అని, ఎంపికైన బాలల జాబితాను జూలై 28న ప్రకటిస్తామని వివరించారు. తరగతులు జూలై 29 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంపిక విధానం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు. వివరాలకు ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్ 9441486931, 86397 59034ను సంప్రదించాలని సూచించారు.

యార్డుకు 47,933 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 47,933 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,141 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.12,000 నుంచి 23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి రూ. 26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,916 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ సబ్ ఇంజనీర్



బాణావత్ రామాంజనేయులు నాయక్

వినుకొండ(నూజెండ్ల) : లంచం తీసుకుంటూ విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామానికి చెందిన ఎ.కోటేశ్వరరావు తన పొలానికి నీరు పెట్టేందుకు విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ కావాలని విద్యుత్‌శాఖ సిబ్బందికి దరఖాస్తు చేసుకున్నాడు. విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ బాణావత్ రామాంజనేయులు నాయక్ రూ.80 వేలు డిమాండ్ చేశారు. ముందుగా రూ.60 వేలు, కనెక్షన్ ఇచ్చిన తరువాత మిగతా రూ.20 వేలు ఇవ్వాలని అడిగారు. దీంతో రైతు కోటేశ్వరరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం వినుకొండ మండలంలోని చీకటీగలపాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రైతు నుంచి సబ్ ఇంజనీర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహేంద్ర ముత్తే తెలిపారు. తనిఖీలో ఏసీబీ డీఎస్పీలు ప్రతాప్, సత్యానందం, ఇన్‌స్పెక్టర్లు రవిబాబు, నాగరాజు, లక్ష్మారెడ్డి, మన్మథరావు, అంజిబాబు, సురేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కేసులో టీడీపీ నాయకులు అరెస్ట్

వెల్దుర్తి: ఇటీవల జరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో టీడీపీ నాయకులు ముఢావత్ రెడ్యానాయక్, కూరపాటి కొండలతోపాటు మరో ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.శ్రీహరి మంగళవారం తెలిపారు. లోయపల్లి గ్రామానికి చెందిన పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఎనిమిది మంది చోరీకి చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మాచర్ల మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు.

జై 'బీమా'

కర్షకుల పరిపుష్టికి ప్రభుత్వం కృషి

- వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు
- పల్నాడు జిల్లాలో 59,007 మంది రైతులకు లబ్ధి
- గత ఖరీఫ్‌కు సంబంధించి ప్రయోజనం
- రూ.26.83 కోట్ల పరిహారం మంజూరు
- 8న రైతు దినోత్సవం సందర్భంగా జమ

గత ఖరీఫ్ బీమా పరిహారం ఇలా..	
దెబ్బతిన్న పంటల విస్తీర్ణం	: 1,06,667 ఎకరాలు
లబ్ధి పొందనున్న రైతులు	: 59,007
పరిహారం మొత్తం	: రూ.26,83,00,000

సాక్షి, నరసరావుపేట: ప్రకృతి వైపరీత్యాలకు కుదేలైన రైతులను ఆర్థికంగా పరిపుష్టం చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. దీనిలో భాగంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమాను 2019 నుంచి దిగ్విజయంగా అమలు చేస్తోంది. రైతులపై పైసా భారం లేకుండా ప్రయోజనం కల్పిస్తోంది. దీని కోసం కర్షకులు ఎవరి దగ్గరకు ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేదు. తమ వద్దకే వస్తున్న ఆర్‌బీకే సిబ్బంది ద్వారా ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేసుకుని ఈ-కేవైసీ పూర్తి చేస్తే చాలు పంటల బీమాకు అర్హత లభించినట్టే. ఉచిత పంటల బీమా పథకంలో భాగంగా 2022 ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, కంది తదితర పంటలకు పరిహారాన్ని ఈ నెల 8న రైతు దినోత్సవం సందర్భంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నగదు జమను ప్రారంభించనున్నారు.

పరిహారం నిర్ధారణ ఇలా..

పల్నాడు జిల్లాలో గత ఖరీఫ్‌కు సంబంధించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద మొత్తం 1,06,667 ఎకరాలకు పరిహారం అందనుంది. రూ.26.83 కోట్ల మొత్తాన్ని 59,007 మంది రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయనుంది. ఇందులో దిగుబడి ఆధారిత బీమా, వాతావరణ ఆధారిత బీమా అని రెండు రకాలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో కంది, వరి పంటల పంటకోత ప్రయోగాల్లో వచ్చిన ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకొని పరిహారం నిర్ధారించారు. గడచిన ఐదేళ్ల సరాసరి ఉత్పత్తిని తీసుకుని లెక్కించారు. ఉదాహరణకు కంది పంట ఈ ఏడాది ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి వస్తే, ఐదేళ్ల సరాసరి ఉత్పత్తి 10 క్వింటాళ్లు ఉంటే వ్యత్యాసం రెండు క్వింటాళ్లకు ఆ రైతు కోల్పోయిన డబ్బును పరిహారం రూపంలో అందిస్తారు. 2022 ఖరీఫ్‌లో జిల్లాలో మొత్తం10,232 మంది రైతులు సాగు చేసిన 16,663 ఎకరాల కంది పంటకు దిగుబడి ఆధారిత పంటల బీమా పరిహారం అందనుంది. వీరికి మొత్తం రూ.4,33,25,454 విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అత్యధికంగా కందిపంటకు ఈఏడాది పరిహారం అందుతోంది. దుర్గి మండలంలోని రైతులకు ఎకరాకు సుమారు రూ.5,960 దాకా నగదు జమ కానుంది. ఒక్క దుర్గి మండలంలోని రూ.1.34 కోట్లు అందనుంది.

పత్తి పంటకు వాతావరణ ఆధారిత బీమా

పల్నాడులో పత్తి పంటను వాతావరణ ఆధారిత పంటల బీమా కింద నోటిఫై చేశారు. దీనికి మండలాన్ని యూనిట్‌గా తీసుకుంటారు. ఆ మండలంలో ఉష్ణోగ్రతలు, వర్షపాతం, గాలిలో తేమ, వర్షాభావ పరిస్థితుల ఆధారంగా తీసుకొని నష్టాన్ని లెక్కించి రైతులకు పరిహారం అందిస్తారు. జిల్లాలో గత ఖరీఫ్‌లో 90,004 ఎకరాలు సాగుచేసిన 48,775 మంది రైతులు పరిహారానికి అర్హులుగా గుర్తించారు. వీరికి ప్రభుత్వం రూ.22,49,84,610 జమ చేయనుంది. పత్తి పంటకు పరిహారం అత్యధికంగా దుర్గి మండలానికి అందనుంది. 5,233 మంది రైతులకు రూ.7.58 కోట్లు దక్కనుంది.

రూ.లక్షకు పైగా జమ కానుంది



గత ఖరీఫ్‌లో 24 ఎకరాల పత్తి పంట సాగుచేశాను. వాతావరణ ఇబ్బందుల వల్ల నష్టపోయాను. ఒక్క రూపాయి ప్రీమియం కట్టకపోయినా జగనన్న రైతుల కోసం ఉచితంగా బీమా సదుపాయం కల్పించారు. దీని ద్వారా రూ.1,02,175 పరిహారం నాకు జమ కానుంది. ఆర్‌బీకే వ్యవస్థ ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. రైతు ప్రభుత్వానికి, స్థానిక వ్యవసాయ సిబ్బందికి ధన్యవాదాలు.

– నెల్లూరు అప్పయ్య, అడిగొప్పుల గ్రామం, దుర్గి మండలం.



పత్తి పంట నష్టాన్ని పరిశీలిస్తున్న దుర్గి ఏఓ అమీర్ రెడ్డి (ఫైల్)



దుర్గి మండలం ధర్మవరం ఆర్‌బీకే వద్ద పంటల బీమా జాబితాలను పరిశీలిస్తున్న రైతులు

ఆర్‌బీకేల్లో అర్హుల జాబితా



వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించే రైతు దినోత్సవం రోజున బీమా పరిహారాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. బీమాకు అర్హులైన రైతుల జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శించాం. సామాజిక తనిఖీ పూర్తయింది. పంటల బీమాకు ఎంతో కీలకమైన ఈ-క్రాప్‌ను రైతులు క్రమం తప్పకుండా పూర్తి చేయడం ముఖ్యం.

– ఐ.మురళీ, పల్నాడు జిల్లా వ్యవసాయశాఖాధికారి



సత్తెనపల్లిలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రి అంబటి రాంబాబులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహావిష్కరణ

- కాపీ, కల్తీ పథకాల టీజరే టీడీపీ మేనిఫెస్టో
- అజాత శత్రువు అంబటి రాంబాబు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

సత్తెనపల్లి : మాజీ శాసన సభ్యుడు వంగవీటి మోహన రంగా జయంతిని పురస్కరించుకొని పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో రంగా కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షత వహించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రంగా వారసత్వం పుణికి పుచ్చుకున్నానని చెప్పుకునే కన్నా లక్ష్మీ నారాయణ అవకాశవాదానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో మన రాష్ట్రం, పొరుగు రాష్ట్ర ప్రభుత్వాల కాపీ, కల్తీ టీజరేననీ విమర్శించారు. వైఎస్సార్ సీపీ గళం, అజాతశత్రువు అంబటి రాంబాబును బలపరచాలని ప్రజలను ఆయన కోరారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రంగా హత్య సమయంలో న్యాయవాదిగా ఉన్న తాను, ఆయన మరణానంతరం 30 ఏళ్ల వయసులో ఎన్నికలలో పోటీ చేసి తొలిసారిగా శాసన సభ్యునిగా ఎన్నికయ్యానని, రంగాపై అపారమైన ప్రేమ, అభిమానం ఉందని, అందుకే సత్తెనపల్లిలో రంగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. మీ అందరి ఆశీస్సులతో వస్తాద్‌ను మట్టి కరిపిస్తానని పరోక్షంగా కన్నా లక్ష్మీ నారాయణ గురించి ప్రస్తావించారు. నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అంబటికి మనం అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మాచర్ల ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రంగా దారుణ హత్య మరకలున్న తెలుగుదేశం పార్టీలో చేరిన కన్నా అసలైన వారసుణ్ణి తానే అంటూ నేటి తరాన్ని మోసపుచ్చుతున్నారని, ప్రజలు ఆయన మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాదరావు మాట్లాడుతూ.. గత పాలకుల దోపిడీని కొనసాగించేందుకే వస్తాద్ ఇక్కడ పోటీకి సిద్ధపడ్డారని కన్నాను పరోక్షంగా విమర్శించారు. అనంతరం ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కిలారి రోశయ్య, నంబూరు శంకరరావు, కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పక్కాల సూరిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అడపా శేషు, గుబ్బా చంద్రశేఖర్, తాడిశెట్టి మురళి, గజ్జల నాగభూషణ్ రెడ్డి, చల్లంచర్ల సాంబశివరావు, పెండెం బాబురావు, షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, ఆకుల శివయ్య, తాళ్ళూరి మోహన్‌బాబు, పులిబండ్ల అశోక్, సదనం హరి తదితరులు పాల్గొన్నారు.

• అందరివాడు రంగా



తాడేపల్లిరూరల్ : రేపల్లె కనకదుర్గ వారధి కరకట్ట వెంబడి ప్రాతూరు వద్ద అమ్మిశెట్టి వారి ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా, ఆయన సోదరుడు వంగవీటి రాధా విగ్రహాలను ఏర్పాటు చేశారు. వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా మంగళవారం విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని నిర్వహించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వంగవీటి మోహన రంగా తనయుడు వంగవీటి రాధా పాల్గొని రంగా అందరివాడని కీర్తించారు.

ఉద్యోగోన్నతుల సందడి

హెచ్ఎం పోస్టులు ప్రమోషన్లతో భర్తీ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగోన్నతుల సందడి కొనసాగుతోంది. బదిలీలు, ఉద్యోగోన్నతులతో విద్యావ్యవస్థలో క్షేత్రస్థాయిలో ఖాళీలను భర్తీ చేసిన ప్రభుత్వం ప్లస్‌టూ స్కూళ్లతో ప్రారంభించి, వరుసగా అన్ని కేడర్లలో ఉపాధ్యాయ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేస్తోంది. తాజాగా ఎంఈఓ-1, 2 పోస్టుల భర్తీతో ఖాళీగా మారిన హెచ్ఎం పోస్టులను మంగళవారం కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు. జోన్-3 పరిధిలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభుత్వ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలల్లో ఎంఈఓ-1 పోస్టుల భర్తీతో ఖాళీ అయిన హెచ్ఎం పోస్టులను భర్తీ చేసేందుకు మంగళవారం గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో ప్రభుత్వ యాజమాన్యంలో 37 హెచ్ఎం పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేశారు.

జెడ్పీ యాజమాన్యంలో..

ఎంఈవో-2 పోస్టుల భర్తీ ద్వారా ఖాళీ అయిన హెచ్ఎం పోస్టులను జెడ్పీ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులతో భర్తీ చేశారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో డీఈఓ పి.శైలజ అధ్యక్షతన జరిగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఖాళీ అయిన 52 హెచ్ఎం పోస్టులను అర్హులైన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల కల్పన ద్వారా భర్తీ చేశారు.



ఎయిమ్స్ భవనాల సముదాయం



ఎయిమ్స్‌లో కొత్తగా నిర్మిస్తున్న 2.5 ఎంఎల్‌డీ వాటర్ ట్యాంక్

నీటి మీద రాతలే

ఎల్లో మీడియావన్నీ అబద్ధాలే

- శరవేగంగా తాగునీటి పనులు
- 2014లో మంజూరైన మంగళగిరి ఎయిమ్స్
- తాగునీటి వసతి గురించి పట్టించుకోని గత తెలుగుదేశం సర్కారు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే తాగునీటి పనులకు నిధులు మంజూరు
- మరో ఆరునెలల్లో పూర్తి కానుండగా పచ్చమీడియాలో తప్పుడు కథనం



ట్యాంకర్ ద్వారా ఎయిమ్స్‌లోని ట్యాంకుల్లో నీటిని నింపుతున్న దృశ్యం

- విజయవాడ కార్పొరేషన్ నుంచి రోజుకు మూడు లక్షల లీటర్ల నీటిని ఎయిమ్స్‌కు సరఫరా చేస్తున్నారు.
- మంగళగిరి కార్పొరేషన్ నుంచి మరో మూడు లక్షల లీటర్లను పంపుతున్నారు. మరో లక్షా 20వేల లీటర్ల శుద్ధి చేయని నీటిని సరఫరా చేస్తున్నారు.
- రోజూ మొత్తం 7.20 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు.

కొసమెరుపు

వాస్తవం ఇది కాగా, నీరు లేక శస్త్రచికిత్సలూ జరగడం లేదని ఎల్లో మీడియా అబద్ధాలు ప్రచురించింది.

ఫ్యాక్ట్ చెక్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎల్లో మీడియా తప్పుడు కథనాలన్నీ నీటిమీద రాతలేనని తేలిపోయింది. మంగళగిరి ఎయిమ్స్‌లో తాగునీటి సరఫరా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఎఐ), అటవీ శాఖ అనుమతులు వస్తే ఈ పనులు నిర్దేశిత సమయానికి పూర్తి చేస్తామని అధికారులు ధీమాగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం 2014 బడ్జెట్‌లో మంగళగిరికి ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను మంజూరు చేసింది. 2017లో పనులు ప్రారంభమయ్యాయి. అయితే అప్పటి నుంచి తాగునీటి సమస్య ఉన్నా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అసలు దీనిపై దృష్టి పెట్టలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎయిమ్స్‌లో మంచినీటి సమస్యపై దృష్టి కేంద్రీకరించింది. దగ్గరలో నీటి వనరులు లేకపోవడంతో గుంటూర్ చానల్ నుంచి ఆత్మకూరు మంచినీటి చెరువుకు నీరు మళ్లించి అక్కడి నుంచి ఎయిమ్స్‌కు సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), అప్పటి ఇన్‌చార్జ్ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు ఎయిమ్స్‌ను సందర్శించి తాగునీటి సరఫరాకు కావాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది జూలై 26న రూ.7.74 కోట్లతో తాగునీటి సరఫరా పనులకు పాలనా అనుమతులు ఇచ్చింది. వెంటనే టెండర్లు పిలిచి నవంబర్‌లో ప్రకాశం జిల్లాకు చెందిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. రోజుకు 2.50 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

నిర్దేశిత సమయానికి పనులు పూర్తి

ఎయిమ్స్‌కు మంచినీటిని అందించేందుకు నిర్దేశించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారి, అటవీ శాఖ అనుమతులు రాగానే ఆ ప్రాంతాల్లో కూడా పనులు పూర్తి చేస్తాం. నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేస్తాం. అప్పటి వరకూ ఇబ్బంది లేకుండా రోజుకు 7.2 లక్షల లీటర్ల నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం.

– శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ, గుంటూరు

పనుల ప్రగతి ఇలా..

- గుంటూరు చానల్ నుంచి ఆత్మకూరు మంచినీటి చెరువు వరకూ 350 ఎంఎం డయా వాటర్ పైపులైన్ 750 మీటర్ల మేర వేయాల్సి ఉండగా ఇప్పటికే 712 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి.
- ఆత్మకూరు చెరువు నుంచి మంగళగిరి ఎయిమ్స్‌లోని 2.50 మిలియన్ లీటర్ల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వరకూ 250 ఎంఎం డయా పైపులైన్ 5,250 మీటర్ల వరకూ జరగాల్సి ఉండగా ఇప్పటికి 3,293 మీటర్ల మేర పని పూర్తయింది.
- వాటర్ సంప్ నుంచి భూగర్భ వాటర్ ట్యాంకులకు 250, 200, 100 ఎంఎం డయా పైపులైన్లు 1,470 మీటర్ల మేర వేయాల్సి ఉండగా 1,175 మీటర్ల మేర పూర్తయ్యాయి.
- ఇప్పటి వరకూ రూ.4.25 కోట్ల విలువైన పనులు, 58 శాతం పూర్తయ్యాయి. సెప్టెంబర్ చివరికి పనులు పూర్తి చేయాల్సి ఉంది.
- వడ్డేశ్వరం వద్ద జాతీయ రహదారి కింద నుంచి పైపులైన్ వేయాల్సి ఉంది. దీని కోసం 52 లక్షల రూపాయలు చెల్లించాలని ఎన్‌హెచ్ఏఐ కోరింది. డబ్బులు చెల్లించగానే ఈ పనులు చేయడానికి ఏజెన్సీ సిద్ధంగా ఉంది. అటవీ శాఖకు రూ.పది లక్షలు చెల్లించాల్సి ఉంది. వీటిని చెల్లించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. మరికొన్ని రోజుల్లోనే ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.
- రూ.2.93 కోట్లతో ఎయిమ్స్‌లో వర్షపునీటి డ్రెయిన్ల నిర్మాణం కోసం పాలనా అనుమతులు మంజూరు చేశారు. రూ.3.03 కోట్ల టెండర్లు ఖరారయ్యాయి. ఈ డ్రెయిన్ 6వ బెటాలియన్ ద్వారా వెళ్లాల్సి ఉంది. దీంతో అక్కడ అలైన్‌మెంట్‌ను నిర్ధారించి అనుమతులు తీసుకునే ప్రక్రియ జరుగుతోంది.



పైప్‌లైన్ పనులు శరవేగంగా జరుగుతుండగా తీసుకొచ్చిన పైపుల ఫొటోను చూపి ఎండకు ఎండుతున్నాయంటూ పచ్చపత్రిక పైత్యపు రాతలు రాసింది.

జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి సహకరిస్తాం


కలెక్టర్‌ను కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

నరసరావుపేట: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి తగిన సహకారం అందజేస్తానని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వెల్లడించారు. పిడుగురాళ్ల, వినుకొండలో గ్రంథాలయాల ఏర్పాటుకు తహసీల్దార్లకు ఫోన్‌చేసి స్థలసేకరణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి కోసం స్థలసేకరణ, సెస్ బకాయిలు, పుస్తక పంపిణీ కేంద్రాల విస్తరణలపై చర్చించారు.

15లోగా పెన్షన్‌దారులు ఈకేవైసీ చేయించాలి

నరసరావుపేటఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు ఈనెల 15వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ట్రెజరీ కార్యాలయం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు, ఫ్యామిలీ పెన్షనర్లు 3,238 మంది ఉండగా ఇంకా 428మంది ఈకేవైసీ చేయించలేదని తెలిపారు. 428మంది పెన్షన్‌దారులు వెంటనే ట్రెజరీ కార్యాలయ అధికారులతో సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

అద్దంకిరూరల్: న్యాయం జరగలేదని పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుమందు తాగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మంగళవారం అద్దంకిలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని చక్రాయపాలెం గ్రామానికి చెందిన తిరుపతి వెంకాయమ్మ గ్రామానికి చెందిన ఆర్‌బీకే సెంటర్‌కు వెళ్లే దారిలో 4.5 సెంట్ల భూమిని ఆక్రమించి గడ్డివాములు వేసుకుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చెయ్యాలని కోరినా చేయకపోవటంతో ఆక్రమణను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు పోలీసులను ఆశ్రయించారు. అద్దంకి సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో మంగళవారం ఆక్రమణ స్థలంలో ఉన్న వరిగడ్డివామి తొలగింపు చర్యలు చేపట్టటంతో తనకు న్యాయం జరగలేదని భావించి వెంకాయమ్మ పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుమందు తాగి ఆత్మహత్య పాల్పడింది. స్థానికుల సాయంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతోంది.

రోశయ్య సేవలు మరువలేని

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా అనేక పదవులు చేసి ఆర్యవైశ్యులకు వన్నెతెచ్చిన వ్యక్తి కొణిజేటి రోశయ్య అని, ఆయన రాష్ట్రానికి చేసిన సేవలు మరచిపోలేనివని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రోశయ్య జయంతి సందర్భంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న కొణిజేటి రోశయ్య విగ్రహానికి ప్రభుత్వ విప్ పీఆర్కే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివాదరహితుడుగా పేరు సంపాదించి రాష్ట్రానికి వన్నె తెచ్చిన గొప్ప ఆర్యవైశ్య నాయకుడు రోశయ్య అన్నారు. ఇటువంటి వ్యక్తి జయంతి కార్యక్రమాలలో తాను పాల్గొనటం ఎంతో సంతోషించదగిన విషయమన్నారు. రాబోయే రోజుల్లో రోశయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆర్యవైశ్యులంతా కృషి చేయాలని కోరారు. అనంతరం రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొత్తమాసు పాండు రంగారావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, కౌన్సిలర్ పోలా శ్రీనివాసరావు, అఖిల భారత వాసవి సత్ర సముదాయాల సలహా మండలి సభ్యులు చిల్లంచర్ల సత్యనారాయణ, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, వాసవి క్లబ్ మహిళా సంఘం అధ్యక్షురాలు మేడా వెంకటలక్ష్మి, లక్ష్మీ ప్రమీల, పరిటాల ధనలక్ష్మి, రాజ్యం, కొత్తమాసు గిరిజ, మారం వాసు, కంభంపాటి అమర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, అనిల్ కుమార్, వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, ఓ చెన్నా, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, రంగా చెన్నయ్య, కొత్తమాసు బ్రహ్మారావు, విడేల శ్రీనివాసరావు తదితరులున్నారు.


మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

అల్లూరి స్ఫూర్తి ఆదర్శం

కలెక్టర్ శివ శంకర్ లోతేటి

నరసరావుపేట: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దుర్గాబాయి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి త్యాగాలను స్మరించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.


కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శివశంకర్

ప్రకృతి వ్యవసాయానికి అగ్ర తాంబూలం

- రాష్ట్రంలో 26 ప్రకృతి వ్యవసాయ ఆదర్శ మండలాలు
- రైతు సాధికార సంస్థ సీఈవో రామారావు

గుంటూరు రూరల్: రాష్ట్రవ్యాప్తంగా 26 మండలాలను ప్రకృతి వ్యవసాయాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసి నూరు శాతం ప్రకృతి వ్యవసాయ ఆదర్శ మండలాలుగా తీర్చిదిద్దుతున్నామని రైతు సాధికార సంస్థ సీఈవో బి.రామారావు తెలిపారు. మంగళవారం గుంటూరులోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఒక మండలం చొప్పున ఆదర్శ మండలాలను గుర్తించామని.. ఆయా మండలాల్లో రసాయన వ్యవసా యం చేసే రైతులందరినీ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపేలా సమాయత్తం చేసేందుకు ప్రత్యేక ప్రాజెక్ట్ అమలు చేస్తున్నామని చెప్పారు. ఆదర్శ మండలాలను తీర్చిదిద్దడంలో పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్(ఏపీఎం), కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ (సీసీ)లు కీలకపాత్ర నిర్వహిస్తారన్నారు. రైతు సాధికార సిబ్బంది, సెర్ప్ సిబ్బంది సమన్వయంతో ఈ దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రసాయన వ్యవసాయం వల్ల నేల నిర్జీవమైపోతోందని, ప్రకృతి వ్యవసాయంతో నేలను బలోపేతం చేసి సారవంతం చేయాలన్నారు.

వ్యాపారవేత్తల సహకారం అవసరం

నరసరావుపేట: పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధికి జిల్లాలో ఉన్న వ్యాపారవేత్తల సహకారం అవసరమని కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. జిల్లా అభివృద్ధిలో భారీ పరిశ్రమల యాజమాన్యాలు తమ వంతు బాధ్యతగా సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనకు తీసుకోవలసిన చర్యలపై ప్రభుత్వ సహకారం ఉంటుందని యాజమాన్యాలతో ప్రస్తావించారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు, సీపీఓ ముక్తేశ్వరరావు, జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ అధికారిణి ధనలక్ష్మి, మైన్స్ అండ్ జియాలజీ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పరిశ్రమల తనిఖీ అధికారి, భూగర్భజలాల శాఖ అధికారి, జిల్లా స్పిన్నింగ్ మిల్లుల అసోసియేషన్, సిమెంట్ కంపెనీ, గ్రానైట్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థలసేకరణ పూర్తి చేయాలి

కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని ఐదు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంజూరు చేసిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ భవనాల నిర్మాణాలకు స్థలసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ ఎల్.శివ శంకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్ నుంచి నకిరేకల్, నూజెండ్ల, కారంపూడి, మాచవరం, నాదెండ్ల మండలాల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అత్యవసర వైద్యసేవలకు ఉపయోగపడేలా భవనాల నిర్మాణం చేపట్టాలని, స్థలసేకరణ పూర్తిచేయాలని సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ జి.శోభారాణి, ఎంఐడీసీ అధికారి శ్రీధర్ ఉన్నారు.

సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్


బట్టువారిపల్లె గ్రామం నుంచి పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు

కారెంపూడి: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కారెంపూడి మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో మాచర్లలో పిన్నెల్లి సమక్షంలో మంగళవారం చేరారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు నచ్చి భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని బట్టువారిపల్లె, పెదకొదమగుండ్ల గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కార్యకర్తలు సుమారు 25 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. భట్టువారిపల్లె గ్రామానికి చెందిన నీలం సంజీవయ్య, వెంకటేశ్వర్లు, గంగరాజు, ఆరుద్ర సైదులు, నలబోతుల పెద అంకారావు, పొన్నపూల వెంకటేశ్వర్లు, బందారు దివ్యగిరి, నీలం అశోక్, గ్రామ మాజీ సర్పంచి చింతకాయల ఆదినారాయణ, బజారు మరో మూడు కుటుంబాలు చేరిన వారిలో ఉన్నారు. అలాగే పెదకొదమగుండ్ల గ్రామానికి చెందిన మరో పది కుటుంబాలు ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గుబిలి వెంకటరామయ్య, శ్రీనివాసరావు, రామచంద్రయ్య, కోటేశ్వరరావు, కరుణ నాగార్జున, కరుణ నాగలింగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి సమర్థ నాయకత్వం నచ్చి ఆయన పనిచేయాలనే అభిలాషతో అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు నచ్చి తామంతా పార్టీలో చేరామని వారు ప్రకటించారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, మందాళ్ల అంజిరెడ్డి, ఆ గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అబద్ధాల కోరు యరపతినేని

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: టీడీపీ నాయకుడు యరపతినేని శ్రీనివాసరావు పచ్చి అబద్ధాల కోరుగా మారాడని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మండిపడ్డారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ యరపతినేని మాట తీరు చూస్తే అతనికి మతి పోయిందేమో అనిపిస్తోందని అన్నారు. నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని, ప్రజలు యరపతినేనిని చూసి అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. నాయకుడు మాట్లాడితే హుందాగా ఉండాలి, అప్పుడే నాయకుడ్ని అనుసరించే వారికి గౌరవంగా ఉంటుంది, అది వదిలేసి సంస్కారహీనుడిలా మాట్లాడుతున్న యరపతినేనిని చూసి టీడీపీ వాళ్లే అసహ్యించుకుంటున్నారని అన్నారు. యరపతినేని తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో పల్నాడుకు చేసిందేమీలేదని అన్నారు. 2014 నుంచి 2019 వరకు సుమారు 27 హత్యలు జరిగాయని, తన వాళ్లనే హత్య చేయించి ఆ నేరం ప్రతిపక్షాలపై మోపడం యరపతినేనికి అలవాటేనని అన్నారు. నియోజకవర్గంలో 57 పంచాయతీలు ఉంటే ఒక హాస్పటల్ కానీ, ఒక స్కూల్ కానీ నిర్మించావా చూపించాలని ప్రశ్నించారు. మాడుగుల గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న యరపతినేని చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. 1983లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన పబ్లిక్ హెల్త్ సెంటర్ 1985లో ప్రారంభమైందని, అప్పుడు నువ్వు రాజకీయాల్లో ఎక్కడున్నావు అని సూటిగా ప్రశ్నించారు. డొక్కా మాణిక్యవరప్రసాద్ మంత్రిగా ఉండగా రెసిడెన్షియల్ స్కూలను తాను పుట్టిన గడ్డ గురజాలకు తెస్తే అక్కడ స్థలం లేకపోతే మాడుగులలో నిర్మించారని తెలిపారు. దాన్ని నువ్వే నిర్మించావని సిగ్గు లేకుండా చెప్పుకుంటున్నావు, మంచినీళ్ల పథకం రాజశేఖరరెడ్డి తెస్తే అదికూడా నువ్వే అని చెప్పుకోవడం హాస్యాస్పదం ఉందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 1.20 కోట్లతో సీసీ రోడ్లు వేశామన్నారు. 2014కి ముందు ఉండటానికి ఇల్లు కూడా లేదని, అధికారం రాగానే 2016లో రూ.40 కోట్ల అవినీతి సొమ్ముతో గుంటూరులో ఇల్లు నిర్మించుకుని పారిపోయావని అన్నారు. మాడుగులలో యరపతినేని చేసిందేమీ లేదని నేను నిరుపిస్తా చర్చకు సిద్ధమా, తాను చెప్పింది అబద్ధమైతే తాను రాజకీయాలనుంచి తప్పుకుంటా.. లేకుంటే నువ్వు రాజకీయాలనుంచి తప్పుకుంటావా అని యరపతినేనికి సవాల్ విసిరారు. సమావేశంలో వైఎస్సార్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన అల్లూరి

నివాళులర్పించిన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట: సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్య్రం సాధ్యమని నమ్మి, అందుకోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ధైర్యశాలి అల్లూరి సీతారామరాజు అని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇతర పోలీసు అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ అల్లూరిని ఒక మహోజ్వల శక్తిగా అభివర్ణించారు. మన్యం వీరుడు, విప్లవ పోరాటయోధుడు అల్లూరి అడుగుజాడల్లో యువత నడుచుకోవాలన్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తిని ఆ రోజుల్లో యావత్ భారతదేశం పునికి పుచ్చుకుందన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం జరిపి రెండు సంవత్సరాలు వారికి నిద్ర లేకుండా చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్ని కృష్ణ, ఆర్ఐ రామారావు, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట: జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి రాష్ట్ర సచివాలయం నుంచి అన్నీ జిల్లాల కలెక్టర్లు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఆయా శాఖల జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి నార్కో కో–ఆర్డినేషన్ సెంటర్ కమిటీ సభ్యులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి స్థానిక అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఎస్ఈబీ అధికారులు జిల్లాలో తాము మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. పోలీసులతో కలిసి ఎస్ఈబీ పోలీసులు ఇప్పటివరకు 73 కేసులు పెట్టి 209 మందిని అరెస్టు చేసి మొత్తం 693 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నామని, గంజాయి మొక్కలను పెంచుతున్న వారిపై మూడు కేసులు నమోదుచేసి 36 గంజాయి మొక్కలను ధ్వంసం చేశామన్నారు. పట్టుబడిన వారిలో మొత్తం 31 మంది ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన వారన్నారు. ఐదుగురు ఇంకనూ జైలు శిక్ష అనుభవిస్తున్నారని, ఇటీవల కాలంలో ఒడిశా నుంచి కూలి పనిపై వచ్చి చిలకలూరిపేట సమీపంలోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు భార్యాభర్తలు వారి మైనర్ కుమారుడు గంజాయి కలిగి ఉండగా అరెస్టు చేసి వారిని కూడా జైలుకు పంపించామన్నారు. జిల్లాలోని అన్ని టెక్నికల్ కాలేజీలైన పాలిటెక్నిక్, ఇంజినీరింగ్‌తోపాటు డిగ్రీ కాలేజీలలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాల గురించి తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. నాటుసారా, అక్రమ మద్యం వ్యాపారానికి పాల్పడిన నిందితులపై పోలీసు, ఎస్ఈబీ అధికారులు కలిసి 17 మంది నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసి రాజమండ్రి జైలుకు తరలించామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ డీ అడిక్షన్ సెంటర్‌లో డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులకు ఆరోగ్యపరమైన చికిత్స అందిస్తూ కౌన్సెలింగ్ ద్వారా సూచనలు ఇస్తూ సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. గంజాయి, కొకైన్, పొగాకు, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాల అలవాటు నిర్మూలించడం, ఇంటర్నెట్, గేమింగ్ అడిక్షన్, మొబైల్‌ఫోన్‌ని ఎక్కువ వాడటం, ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర చెడువ్యసనాలు మాన్పించడం వంటి కార్యక్రమాలను జిల్లా అధికారులు కలిసి సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డీఆర్వో కె.వినాయకం, పల్నాడు జిల్లా ఎస్ఈబీ ఈఎస్ వి.చంద్రశేఖరరెడ్డి, జేకే చంద్రశేఖర్, షేక్ షానవాజ్, ఎస్సీ సెల్ డీసీపీ ఎస్.సతీష్‌కుమార్, కే హనుమనాయక్, షేక్ ఉమర్‌వలి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సతీష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, డీఈవో కె.శామ్యూల్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి అరుణ పాల్గొన్నారు.

తైక్వాండోలో ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థినికి రజతం

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి జూనియర్స్ తైక్వాండో పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని ఎం.ఎం.అంజలీసాయిలక్ష్మి రజిత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య మంగళవారం తెలిపారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో జూనియర్స్ 46కేజీల విభాగంలో సాయిలక్ష్మి రజిత పతకం సాధించిందని వివరించారు. సాయిలక్ష్మిని కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ఇంటర్మీడియెట్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ అభినందించారు.

అల్లూరి స్ఫూర్తితో గిరిజన హక్కులు కాపాడుతున్న జగన్

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

సాక్షి, అమరావతి: మన్య ప్రజల హక్కుల కోసం, వారి రక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిని భావితరాలకు అందించాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. విజయవాడలోని ఎస్టీ కమిషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అల్లూరి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి శంకర్ నాయక్ అంజలి ఘటించారు. అల్లూరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అల్లూరి స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్ గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి, వారి హక్కుల రక్షణకు విప్లవాత్మక చర్యలు చేపట్టారని కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ పాట్లూరి పద్మావతి, జి.అరుణ, ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆంధ్ర సెంట్రల్ జోన్ టెస్ట్ మ్యాచ్‌లు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదచెరువులోని ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం ఆంధ్ర సెంట్రల్ జోన్ అండర్–19 బాలుర టెస్ట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. కృష్ణా, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల జట్ల మధ్య మూడు రోజుల టెస్ట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. వర్షం కారణంగా ఆట ఆలస్యంగా ప్రారంభమైంది. బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది. జట్టులోని వి.జశ్విన్ 62, హర్ష 30 పరుగులు చేశారు. చైతన్య 24, మొహమ్మద్ 2 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. కృష్ణా బౌలర్లు ఆర్.యశ్వంత్, ఎల్.చిన్నా చెరో 3వికెట్లు సాధించారు. బుధవారం రెండవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావులు పర్యవేక్షించారు.

స్వేచ్ఛలేని జీవితం జీవచ్ఛవం లాంటిది

ఏఎన్‌యూ: స్వేచ్ఛలేని జీవితం జీవచ్ఛవం లాంటిదని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పీవీ విజయబాబు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రస్తుత వీసీ రాజశేఖర్ నేతృత్వంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన దేశభక్తుడు అల్లూరి సీతారామరాజుని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు, నేటి యువత దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఏఎన్‌యూ వీసీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ త్వరలో ఆయన విగ్రహాన్ని ఏఎన్‌యూ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.వి.ఆర్.కృష్ణంరాజు, ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వకళా పరిషత్ సంగీత నృత్య శాఖ ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం

పట్నంబజారు: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో నగదు దోచుకున్న సంఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్సై షేక్ ఖాజీబాబు తెలిపిన వివరాల ప్రకారం పొన్నూరు రోడ్డులోని పంచవటి అపార్టుమెంట్‌లో నివాసం ఉండే మొహమ్మద్ తాహా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావడంతో వర్క్‌ఫ్రం హోమ్ చేస్తున్నారు. ఈక్రమంలో ఇన్‌స్టాగామ్‌లో ఆన్‌లైన్ లింక్‌ను ఓపెన్ చేసి లింక్ ద్వారా ఇచ్చిన వాట్సాప్ నంబరుకు చాటింగ్ చేస్తూ ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయడం మొదలు పెట్టాడు. పలు దఫాలుగా వాట్సాప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు సూచించిన విధంగా రూ. 9.17 లక్షలు ఆన్‌లైన్ ట్రేడింగ్ చేశాడు. ట్రేడింగ్ వల్ల ఎలాంటి లాభాలు రావడం లేదని సదరు గుర్తుతెలియని వ్యక్తులు తిరిగి డబ్బులు ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.